# మరోసారి రాజేసిన కులాల కుంపటి

**దోపిడీ** పాలకవర్గాలు రాష్ట్రంలో మరోసారి కుల ప్రాతిపదికన ప్రజలను చీల్చివేసేందుకు పూనుకున్నాయి. ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించని పాలకవర్గాలు ప్రజలను చీల్చి, నల్లేరుపై బండిలా తమ పాలన సాగించుకోజూస్తున్నాయి. పాలకుల ఈ విధానపు పర్యవసానంగా తలయెత్తినదే కాపులను బిసిలలో చేర్చాలన్న ఆందోళన.

అభివృద్ధి మంత్ర జపం చేస్తూ పాలకులు అనుసరిస్తూ వచ్చిన విధానాల ఫలితంగా దేశంలో నానాటికీ పేదరికం, నిరుద్యోగ సమస్య పెరిగిపోతున్నాయి. దుర్భర జీవన పరిస్థితుల్లో ప్రజల్లో అశాంతి పెరుగుతున్నది. భవిష్యత్తు అగమ్యగోచరమై యువత నిరాశా నిస్పృహలకు లోనవుతున్నది. కొద్దిపాటి ఉపశమన చర్యలు, ప్రజాకర్షక పథకాలతో వీరిని ఆకర్షించేందుకు పూనుకుంటూనే, వీరు సంఘటితపడి పోరాట పథం చేపట్టకుండా చేసేందుకు పాలకవర్గాలు కుల, మత, ప్రాంతీయతత్వాలను రెచ్చగొడుతున్నాయి.

ఆర్థిక సంక్షోభభారం పెంచిన సమయంలోనే, 1980 దశాబ్దం చివర కాపు, కమ్మ కులాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టారు. ప్రపంచబ్యాంకు సిఇవో నంటూ నూతన ఆర్థిక విధానాల అమలు సమయంలో ఎస్‌సి వర్గీకరణ పేరిట దళిత కులాల మధ్య ఈనాటికీ ఆరని చిచ్చు పెట్టారు. సంస్కరణల రెండవ దశ అమలు అంటూ ప్రాంతీయ వైమనస్యాలను రెచ్చగొట్టి రాష్ట్ర విభజన చేశారు. ఈ అన్ని సందర్భాలలోనూ నిరుద్యోగ సమస్యకు మూలకారణాలను తెలియకుండా చేసి, ప్రభుత్వరంగంలో ఉద్యోగాలను తగ్గించివేస్తున్న వాస్తవాన్ని దాచిపెట్టి, తమ సమస్యలకు మరో కులంవారో, మరో ప్రాంతంవారినో కారణంగా చూపెట్టి యువకులను పాలకవర్గాలు దారి మళ్లించాయి. పాలకవర్గ పార్టీలు ఆశలుపెట్టినట్లుగా కాపులను బిసి లిస్టులో చేర్చలేదు; ఎస్‌సీల వర్గీకరణ చెయ్యలేదు. విభజన తర్వాత ఇరువైపులా నిరుద్యోగ సమస్య తీర్చలేదు.

అధికార గద్దెనెక్కెందుకు కాపులను బిసి లిస్టులో చేరుస్తామంటూ టిడిపి 2014 ఎన్నికల్లో వాగ్దానం చేసింది. గద్దెనెక్కిన తర్వాత దీని అమలుకు పూనుకోలేదు. అరకొర చర్యలతో తృప్తిపరచచూసింది. దీనితో కాపులను బిసిల లిస్టులో తక్షణమే చేర్చాలన్న ఆందోళన ముందుకొచ్చింది.

రాష్ట్రవిభజన జరిగిన నాటినుండీ, ఆకుకూ, పోకకూ చెందని "ప్రపంచస్థాయి" వాగ్దానాలలో ఆశల పందిళ్లు వేయటమే పనిగా పెట్టుకున్న చంద్రబాబునాయుడు, ఇటు ప్రతిపక్షాలు ఈ సమస్య పరిష్కారానికి పూనుకోకపోగా స్వార్థరాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకే పూనుకున్నారు. కాపులను బిసిలిస్టులో చేరిస్తే బిసిలకు జరిగే నష్టాన్ని సహించబోమంటూ తమ పార్టీ నాయకులే ప్రకటించడాన్ని ఆపకపోగా రాజకీయాలకు అతీతమైనది ఈ సమస్య అంటూ దానినే సమర్థించారు.

కాపులను బిసి లిస్టులో చేర్చినా, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యగానీ, ఇతర ప్రజాసమస్యలుగానీ పరిష్కారం కాబోవు. వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయకుండా కులానికొక కార్పోరేషన్‌పెట్టి ఉద్ధరిస్తామంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు. ప్రజాజీవనంలో నిజమైన అభివృద్ధిని నిరాకరిస్తున్నారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వేగవంతమైన గత రెండు దశాబ్దాలపైగా కాలంలో ప్రపంచమంతటా ప్రజా జీవనసంక్షోభం మరింత పెరుగుతూ వస్తోంది. దీని దుష్ఫలితాలపై, తమ దుర్భర పరిస్థితులపై ప్రజాగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకోవడాన్ని కూడా ప్రపంచ సామ్రాజ్యవాదులు చవిచూస్తున్నారు. కనుక సామ్రాజ్యవాదులు తమ దోపిడీ ప్రయోజనాలను నిరాఘాటంగా కొనసాగించేందుకు, ప్రపంచ దేశాలలోని అత్యంత విలువైన వనరులను కబళించటానికీ సైనిక దాడులకు పాల్పడటంతోపాటుగా, ఆధునికాంతరవాద అపసవ్యపు వితండవాదనలను ప్రేరేపిస్తూ ఆయాదేశాలలో మత, ప్రాంత, జాతి విద్వేషాలను ఎగదోయటం, నిరంతర ఘర్షణలను, ఉద్రిక్తతలను రాజేయటం, వీటిని అణిచే సాకుతో ప్రజలపై క్రూరనిర్బంధాన్ని ప్రయోగించటం, మరోవైపున వీటి నడుమ నుండే తమ దోపిడీని సజావుగా, నల్లేరుపై బండిలా సాగించుకుంటూ వెళ్తున్నారనేది నిరాకరించవీలులేని వాస్తవం.

ప్రపంచ సామ్రాజ్యవాద ప్రభువుల ముందు సాగిలపడిన మనదేశ, రాష్ట్ర పాలకులు కూడా, వారి ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజా వ్యతిరేక విధానాలను దొర్లించుకుంటూ పోవాలంటే, ప్రజల దృష్టిని మళ్ళించే సాధనాన్ని ఎప్పుడూ సిద్ధంగా వుంచుకుంటారనేదాన్ని విస్మరించరాదు. చిన్న రాష్ట్రాలుగా విభజించబడటం ద్వారా తమ దోపిడీని తీవ్రం చేయబూనుకుంటున్న సామ్రాజ్యవాదులు, ఆయా రాష్ట్రాలలోని వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టేందుకు, తమ దుర్మార్గ దోపిడీ విధానాలకు ప్రజా వ్యతిరేకత అడ్డురాకుండా వుండేందుకు ప్రజలను ముక్కచెక్కలు చేసేందుకు నిశ్చయాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు దోచిపెట్టేందుకు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేపట్టిన నిర్బంధ భూసేకరణ విధానం; రాజధాని, విమానాశ్రయాలు, ప్రాజెక్టులు, గిరిజన ప్రాంతాలలో గనుల త్రవ్వకం సెజ్జులపేరిట లక్షల ఎకరాల భూముల సేకరణ వంటి ప్రజా వ్యతిరేక చర్యలపట్ల నిరసనాందోళనలు విస్తృత రూపం తీసుకుంటున్నాయి. ప్రజలను కుల, మత, ప్రాంతాలకతీతంగా వారందరి తక్షణ, మౌలిక సమస్యలపై దోపిడీ పాలక ప్రభుత్వాలకు, సామ్రాజ్యవాదుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా నిలకడైన సంఘటిత ప్రజా ఉద్యమాన్ని నిర్మించటం మినహా మరో దగ్గర మార్గమేమీ లేదు.

కనుక, సామ్రాజ్యవాదులూ, వారి తాబేదార్లయిన మనదేశ, రాష్ట్రపాలకులు ఆడే దోపిడీ క్రీడలో పావులై, మండిమసై పోవద్దు! పాలకులు ఎగదోస్తున్న కుల వైషమ్యాలలో సమిధలు కాకుండా, మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రజలు సంఘటితపడాలి.

oooooo